సాక్షి నిజామాబాద్

మంగళవారం । 13 । ఆగస్టు । 2024



‘మత్తు’కు దూరంగా ఉండాలి

మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని సీజీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్ అన్నారు.

- 8లో ▸



ప్రజావాణికి 154 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 154 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు ఫిర్యాదులను స్వీకరించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /24.4

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పెరిగిన ఇన్‌ఫ్లో



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. 5100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, కాకతీయ కాలువ ద్వారా 2750, సరస్వతి కాలువ ద్వారా 300, లక్ష్మి కాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 502 క్యూసెక్కులు పోతుండగా, మిషన్ భగీ రథకు 231 క్యూసెక్కులను విడుదల చేస్తు న్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు)అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1080.8(47.25టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగుతుడటంతో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఒక్క టర్బయిన్ ద్వారా 4.5 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు.

డీఈవోను కలిసిన ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ



నిజామాబాద్‌నాగారం: జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్‌ను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) నూతన కార్యదర్శి నాగమణి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగమణికి డీఈవో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్నను సైతం కలిశారు. కార్యక్రమంలో టీజీ పేటా సంఘం అధ్యక్షులు గోపిరెడ్డి, ఇందిర, భారతి పాల్గొన్నారు.

ఉత్తమ లైబ్రేరియన్‌గా తారకం



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా విధులు నిర్వర్తిస్తున్న తారకం తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ చేతుల మీదుగా బెస్ట్ లైబ్రేరియన్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకున్న తారకం.. తెలంగాణ పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఏవీఎస్ రాజు, డిప్యూటీ డైరెక్టర్ హరిశంకర్, అసిస్టెంట్ డైరెక్టర్ నర్సింలు, జిల్లా కేంద్ర గ్రంథాలయాల సెక్రెటరీ బుగ్గారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

జీసీడీవోగా భాగ్యలక్ష్మి

నిజామాబాద్ అర్బన్: గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీవో)గా భాగ్యలక్ష్మి నియమితులయ్యారు ఈమేరకు సోమవారం నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇది వరకు జీసీడీవోగా పని చేసిన వనిత బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ఇందల్వాయి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న భాగ్యలక్ష్మిని నియమించారు.

జనానికి దూరంగా..

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ విభాగాల్లో ఓ వైపు పెరిగిపోయిన అవినీతి.. ముడుపులు ముట్ట జెప్పనిదే పనికావడం లేదని విమర్శలు.. కమిషనర్‌ను కలిసి విన్నవిద్దామనుకుంటే ఆయనేమో దగ్గరకు రానీయని పరిస్థితి. మహాభారతంలో సైంధవుని పాత్రలో కమిషనర్ చాంబర్ ముందు సీసీ పోస్టులో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అడ్డుకుంటారు. మరి ప్రజలు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలి.. ఏం చేయాలి..?

- విమర్శలకు దారితీస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తీరు
- అవుట్‌సోర్సింగ్ సీసీని దాటి వెళ్లలేని సందర్శకులు
- ఇటీవల రోజంతా వేచిచూసిన ఓ డివిజన్ ప్రజలు
- ‘టౌన్‌ప్లానింగ్’ లో దశలవారీగా ముడుపులు ముట్టజెప్పాల్సిందే
- సైట్ ఇన్‌స్పెక్షన్ నుంచి టెక్నికల్, టైటిల్ విభాగాల వరకూ దోపిడీ పర్వం
- టీఎస్‌బీపాస్ ద్వారా భారీగా అక్రమాలకు పాల్పడుతున్న వైనం
- తిరస్కరణకు గురైన దరఖాస్తుల డబ్బులు తిరిగివ్వని పరిస్థితి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతికి అంతనేదే లేకుండా పోయింది. పాలన అస్తవ్యస్తంగా మారిన నేపథ్యంలో ప్రతి విభాగంలో దోపిడీ పర్వానికి అడ్డూ అదుపూ లేని పరిస్థితి. ఈ విషయమై పలువురు సోషల్ మీడియా ద్వారా సైతం తమ యుద్ధాన్ని చేస్తూ వస్తున్నారు. తాజాగా ఇన్‌చార్జి మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌పై ఏసీబీ ప్రత్యేక బృందం దాడి చేసిన సందర్భంగా అనేక అక్రమాస్తులు, లెక్కలు లేని భారీ నగదు లభించింది. ఇంతకు మించిన పెద్ద పెద్ద తిమింగలాలు మున్సిపాలిటీలో భారీగానే ఉన్నాయంటున్నారు. కీలక అధికారి అండతోనే కిందిస్థాయి అధికారులు, సిబ్బంది రెచ్చిపోతున్నారని పలువురు బాధితులు పేర్కొంటున్నారు.

ఇక మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కలవాలంటే గగనమని చాలామంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా ఇటీవల ఓ డివిజన్‌కు చెందిన ప్రజలు కమిషనర్‌ను కలిసేందుకు ఉదయం వెళ్లి సాయంత్రం వరకు వేచిచూసినప్పటికీ అవకాశం ఇవ్వకపోవడం గమనార్హం. దీంతో వారు ‘సాక్షి’తో ఆవేదన వ్యక్తం చేశారు.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో..

మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎల్‌ఆర్‌ఎస్, బిల్డింగ్ అనుమతులు తదితరాలకు అడుగడుగునా ముడుపులు ముట్టజెప్పాల్సిన దుస్థితి ఉంది. ఈ సెక్షన్‌లో మాఫియా మాదిరిగా దందా నడుస్తోందని దరఖాస్తుదారులు వాపోతున్నారు. టీఎస్‌బీపాస్ కింద దరఖాస్తులు చేసుకుంటే అనుమతులు ఇచ్చే విషయంలో అధికారులు అవస్థలకు గురిచేస్తున్నారు. అనుమతుల ప్రక్రియ విషయంలో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ తమ దందా కొనసాగిస్తున్నారు. నగరంలోని ఓ ప్రాంతంలో టీఎస్‌బీపాస్ కింద నిర్మాణాల విషయంలో అనుమతులు ఇచ్చేందుకు పక్కపక్కనే ఉన్న రెండు ప్లాట్లకు అన్ని సక్రమంగానే ఉన్నప్పటికీ ఒకదానికి అనుమతులు ఇచ్చి, మరోదానికి తిరస్కరించడం గమనార్హం. ఫీజుల వసూలు లోనూ పారదర్శకత లేకపోవడం విశేషం. గతంలో 103 గజాల ప్లాట్‌కు సంబంధించి నిర్మాణం కోసం రూ.79,340 ఫీజుగా వసూలు చేసి అనుమతి తిరస్కరించారు. కాగా 106 గజాల ప్లాట్‌కు సంబంధించి నిర్మాణం కోసం రూ.42,840 మాత్రమే ఫీజు తీసుకుని అనుమతులు ఇచ్చారు. ఈ ఫీజు విషయంలో ఒక ప్రామాణికత పాటించడం లేదు. సైట్ ఇన్‌స్పెక్షన్‌లో క్లియరెన్స్ వస్తే అనుమతులు ఇవ్వాల్సి ఉండగా పత్రాలు సక్రమంగా లేవంటూ సహేతుక కారణాలు చూపించకుండానే టెక్నికల్, టైటిల్ విభాగాల్లో దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. అంటే ఇక్కడ ప్రతి విభాగంలో దశలవారీగా ముడుపులు ఇస్తేనే అనుమతులు ఇచ్చే పరిస్థితి సృష్టించారు. ఇదిలా ఉండగా తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సంబంధించి డబ్బులు తిరిగిచ్చే విషయంలో ఏమాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు.

సీసీని దాటి..

కార్పొరేషన్ కమిషనర్ సీసీగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని దాటుకుని ఏ ఒక్కరూ కమిషనర్‌ను కలవలేని పరిస్థితి నెలకొంది. సందర్శకులతో పాటు సిబ్బందికి సైతం కమిషనర్‌ను కలిసేందుకు మినహాయింపు లేదు. పైగా ఈ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని కమిషనర్ నందిపేట తహసీల్ కార్యాలయం నుంచి ఏరికోరి మరీ తెచ్చేకోవడం విశేషం. ఈ సీసీపై అనేక ఫిర్యాదులు వచ్చినప్పటికీ కమిషనర్ తనకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. కమిషనర్ తీరుపై నగర కార్పొరేటర్లతో పాటు కీలక ప్రజాప్రతినిధులు గుర్రుగా ఉన్నారు.

విచారణలకే పరిమితం

- ఫిర్యాదులు అందినా ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు కరువు
- వైద్యారోగ్యశాఖలో వింత ధోరణి
- న్యాయం కోసం బాధితుల ఎదురుచూపులు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో పెరుగుతున్న ఘటనలు

నిజామాబాద్‌నాగారం: వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే ప్రాణాల మీదికి తెస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదు తీవ్రత ఎక్కువగానే ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. సంబంధిత అధికారులు కాలయాపన చేస్తూ విచారణ నివేదికలను బహిర్గతం చేయడం లేదనే ఆరోపణలున్నాయి. న్యాయం కోసం బాధితులకు ఎదురుచూపులు తప్పడం లేదు. నగరంలోని ఖలీల్‌వాడి, ప్రగతినగర్, ద్వారకానగర్, పోచమ్మగల్లీ, బోధన్ రోడ్, కంఠేశ్వర్ తదితర ప్రాంతాల్లో వందల సంఖ్యలో ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. వీటికి తోడు మల్టీ, సూపర్‌స్పెషాలిటీ పేర్లతో పదుల సంఖ్యలో ఆస్పత్రులు వెలిశాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రతిరోజూ ఏదో ఓ చోట వివాదాస్పద ఘటన చోటుచేసుకుంటూనే ఉంది!

గర్భిణీకి వైద్యం వికటించి..

బోధన్‌రోడ్‌లోని షాహీన్ ఆస్పత్రిలో గర్భిణీకి వైద్యం వికటించింది. తీవ్రరక్తస్రావం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి విచారణ చేపట్టి

పదేళ్ల బాలుడికి కాలం చెల్లిన ఇంజెక్షన్

ధర్పల్లికి చెందిన దీక్షిత్ అనే 10 నెలల బాలుడు అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు నగరంలోని కిడ్స్‌కేర్ పిల్లల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం మార్చి నెలలో తీసుకువచ్చారు. ఆస్పత్రి వైద్యులు కాలం చెల్లిన ఇంజెక్షన్ ఇవ్వడంతో తమ బాబు మృతి చెందాడని తల్లిదండ్రులు కలెక్టర్‌తోపాటు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజనాదేవి ఆధ్వర్యంలో వైద్యులు, డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ కలిసి విచారణ చేపట్టారు. అయితే, విచారణకు సంబంధించిన నివేదిక ఇప్పటి వరకు బహిర్గతం చేయలేదు.

విచారణ చేపట్టినప్పటికీ ఎలాంటి చర్యలు లేకుండా పోయాయని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్కానింగ్‌సెంటర్‌లో స్పై కెమెరాలు

జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్కానింగ్ సెంటర్‌లో వెలుగు చూసిన అశ్లీల వీడియోల ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. స్కానింగ్ సెంటర్ స్పై కెమెరాలు ఏర్పాటు చేసి మహిళలకు సంబంధించిన వీడియోలను రికార్డు చేసిన ప్రశాంత్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, స్కానింగ్ తూతూ మంత్రంగా చర్యలు తీసుకొని వదిలేశారని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



కిడ్స్‌కేర్ ఆస్పత్రిలో ఏప్రిల్ 6న విచారణ చేపడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనాదేవి

పూర్తి వివరాలు తెలుసుకుంటా



నేను ఇటీవలే బాధ్యతలు స్వీకరించాను. అన్ని ఫైళ్లను పరిశీలిస్తున్నాను. ఆ తరువాతే స్పందిస్తా. ఏ ఘటనకు సంబంధించి అయినా విచారణ పూర్తయితే, నివేదిక ఆధారంగా కచ్చితంగా చర్యలు ఉంటాయి. పూర్తి వివరాలు తెలుసుకుంటాను. – డాక్టర్ రాజశ్రీ, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి

కోర్టు తీర్పు ఇచ్చినా అందని ఆటో

- సీజ్ చేసిన ఆటో భాగాల మార్పిడి
- పోలీస్‌స్టేషన్‌లోనే భద్రత లేకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్న బాధితులు

ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండేళ్ల క్రితం నగేష్ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. దీంతో కోర్టు నిందితుడిని జైలుకు పంపించగా.. ఆయన ఆటోను సీజ్ చేశారు. రెండేళ్ల తర్వాత నగేష్ కుటుంబసభ్యులకు ఆటోను ఇవ్వాలని కోర్టు తీర్పు వెలువరించింది. కోర్టు ఆర్డర్‌కాపీతో డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు నగేష్ కుటుంబసభ్యులు వెళ్లారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న ఆటో అద్దం పగిలి పోయింది. ఆటోకు చెందిన సీట్లు, ఇంజిన్, టైర్లు మార్చినట్లు నగేష్ కుటుంబసభ్యులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. ఉన్న ఆటోను తీసుకువెళ్లాలని పోలీసులు చెప్పడంతో నగేష్ కుటుంబసభ్యులు మళ్లీ కోర్టులో జడ్జిని కలిసి పరిస్థితిని వివరించారు. ఆటోను బాగు చేసి సీజ్ చేసినప్పుడు ఏవిధంగా ఉందో అదే విధంగా ఇవ్వాలని జడ్జి, డిచ్‌పల్లి ఎస్సైకి తెలిపారు.

ఆటోకు తాత్కాలిక మరమ్మ తులు చేసి కోర్టుకు తీసుకువచ్చారు. ఆటోలో సామగ్రి ఎప్పటి లాగానే ఉందని, ఎలాంటి మార్పులు చేయలేదని నగేష్ కుటుంబసభ్యులు మళ్లీ జడ్జి దగ్గర మొరపెట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆటోకు సంబంధించిన వస్తువులకే భద్రత లేకపోతే ఇంకెక్కడ భద్రత ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

చిగురిస్తున్న ‘రేషన్’ ఆశలు

- కొత్త కార్డుల జారీ, పేర్ల నమోదుపై స్పష్టత వచ్చే అవకాశం
- పథకాల అమలులో కార్డుకు ప్రాధాన్యత

మోర్తాడ్(బాల్కొండ): కొత్త రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న వారిలో మంత్రివర్గ ఉప సంఘం ప్రకటన ఆశలను చిగురింపజేసింది. కొత్త రేషన్ కార్డుల జారీకి విధివిధానాలను ఖరారు చేస్తున్నామని శనివారం కమిటీ ప్రతినిధులు వెల్లడించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఏ సంక్షేమ పథకానికైనారేషన్ కార్డు ప్రామాణికం కావడంతో కొత్త కార్డుల జారీకి ప్రాధాన్యత సంతరించుకుంది. కొత్త కార్డులకు అర్హత నియమాల్లో ఎలాంటి మార్పులు చేయకుండా గతంలో ఉన్న నిబంధనలనే అమలు చేస్తుండటంతో అందరికీ కార్డులు జారీ అవుతాయనే ఆశతో ఉన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,81,244 తెల్లరేషన్, 20,940 అంత్యోదయ, 1,061 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. కార్డుల్లో పేర్ల నమోదు కోసం జిల్లాలో 77,758 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేయాలనే అభ్యర్థనలకు మోక్షం లభించకపోవడంతో సంవత్సరాల తరబడి అనేక మంది ఎదురు చూస్తున్నారు.

పిల్లల్లో దేశభక్తిని పెంపొందించాలి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- జాతీయత, దేశభక్తి, ఐక్యత చాటి చెప్పేలా సాగిన తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు

సుభాష్‌నగర్: చిన్ననాటి నుంచే పిల్లల్లో దేశభక్తిని పెంపొందించాలని, ప్రతి ఇంట్లో శివాజీ మహరాజ్‌ను తయారు చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. బీజేపీ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని గాంధీచౌక్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా.. ‘భారత్ మాతాకీ జై’ నినాదాలతో ఇందూరు నగరం హోరెత్తింది. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయత, దేశభక్తి, ఐక్యత చాటి చెప్పేలా తిరంగా ర్యాలీ చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఎందరో వీరుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, జాతీయత, దేశభక్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పే విధంగా దేశమంతటా ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మన దేశ భక్తి, సంస్కృతి కారణంగానే ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందన్నారు. శివాజీమహరాజ్, చంద్రశేఖర్ ఆజాద్, సుభాష్ చంద్రబోస్, అల్లూరి, ఝాన్సీలక్ష్మీబాయి వంటి వీరులు, వీర వనితలను ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు, కార్పొరేటర్లు గోపిడి స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పంచరెడ్డి ప్రవళిక, స్వామి యాదవ్, మాస్టర్ శంకర్, రెంజర్ల నరేశ్, సుక్క మధు, మెట్టు విజయ్, సాయివర్ధన్, వేణు, ఆకుల హేమలత, బీజేవైఎం, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు ఇందూరు నగరం బంద్

సుభాష్‌నగర్: బంగ్లాదేశ్‌లో హిందూ ఆడబిడ్డలు, దేవాలయాలపై జరుగుతున్న దాడులు, మారణకాండను నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో 14న నిజామాబాద్ నగర బంద్, మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆర్‌ఆర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. హిందువులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. వ్యాపార, వర్తక సంఘాలు, విద్యాసంస్థలు, సినిమా థియేటర్ల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని ధన్‌పాల్ విజ్ఞప్తిచేశారు. సమావేశంలో హిందూ సంఘా ల ప్రతినిధులు న్యాలం రాజు, కొండా ఆశన్న, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పిల్లి శ్రీకాంత్, దాత్రిక రమేశ్, ఇప్పకాయల కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

23 మంది నుంచి రూ.50 వేల చొప్పున వసూలు

- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరిట టోకరా
- మైనారిటీ సంక్షేమ అధికారి నిర్వాకం
- మధ్యవర్తిగా హాస్టల్ వార్డెన్

ఉద్యోగాల పేరిట వసూళ్ల దందా



నాగారంలోని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం

నిజామాబాద్‌అర్బన్: అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఒకరు 23 మంది నుంచి డబ్బులు వసూలు చేశారు. అనర్హులను కొందరిని సదరు అధికారి టీచర్లుగా నియమించడం మైనార్టీ సంక్షేమ శాఖలో చర్చనీయాంశమైంది.

జిల్లాలో 16 మైనారిటీ సంక్షేమ శాఖ కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయి. ఇటీవల గురుకుల నియామకాలు పూర్తి కావడంతో రెగ్యులర్ బోధకులు అందుబాటులోకి వచ్చారు. 35 మంది రెగ్యులర్ బోధకులను కేటాయించడంతో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన కొనసాగుతున్న 33 మందిని మైనారిటీ సంక్షేమ అధికారులు తొలగించారు. నిబంధనల ప్రకారం రెగ్యులర్ వారు అందుబాటులోకి వస్తే అవుట్‌సోర్సింగ్ వారిని తొలగిస్తారు. ఇదే అదునుగా భావించిన మైనారిటీ సంక్షేమ అధికారి.. మీకు మళ్లీ ఉద్యోగం ఇప్పించే బాధ్యత నాదంటూ ఉద్యోగాలు కోల్పోయిన బోధకుల వద్ద వసూళ్ల పర్వానికి తెరలేపారు. నగరంలోని ఓ మైనారిటీ వసతి గృహం వార్డెన్‌ను మధ్యవర్తిగా నియమించుకుని 23 మంది వద్ద నుంచి రూ.50 వేల చొప్పున అడ్వాన్సుగా వసూలు చేశాడు. ఉద్యోగంలో చేరిన తరువాత మరో రూ.50 వేలు ఇవ్వాలని సూచించాడు. 23 మందిలో నుంచి నలుగురిని ఉద్యోగాల్లో చేర్చినప్పటికీ వారికి నియామకపత్రాలు ఇవ్వలేదు. నిజామాబాద్ నుంచి వర్ని ప్రాంతంలో ఒకరికి, రెంజల్ ప్రాంతంలో మరొకరికి, జిల్లా కేంద్రంలోనే ఇద్దరిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. అయితే, ఉద్యోగాల్లో చేరిన వారిని నియామక పత్రాలు తీసుకురావాలని శాఖ అధికారుల నుంచి ఒత్తిడి పెరిగింది. ఇదిలా ఉండగానే, నలుగురికి ఉద్యోగాలు ఇప్పించానని చెబు తూ మరోవైపు మిగతా వారి వద్ద నుంచి సదరు అధికారి అక్రమంగా డబ్బులు వసూలు చేశారు. గ త కొన్నేళ్లుగా శాఖలో వివాదాస్పదుడిగా కొనసాగుతున్న అధికారిని ఇటీవలే కొన్ని బాధ్యతల నుంచి తప్పించినట్లు తెలిసింది. అయినప్పటికీ ఉద్యోగాల పేరుతో అధికారి వసూళ్లకు పాల్పడడం గమనార్హం.

మా దృష్టికి వచ్చింది

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. విచారణ జరుపుతున్నాం. బాధితులు ఎవరూ ముందుకు రావడం లేదు. దీనిపై లోతుగా విచారణ చేసి డబ్బులు వసూలు చేసినవారిపై చర్యలు తీసుకుంటాం. ఉద్యోగాల కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వకూడదు. అర్హత ఉన్నవారికి తప్పనిసరిగా ఉద్యోగాలు వస్తాయి. ప్రస్తుతం మైనారిటీ సంక్షేమ శాఖలో ఖాళీలు లేవు. ఉద్యోగాల భర్తీ కూడా చేపట్టడం లేదు.

– కృష్ణవేణి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి

బోధన్ ఏఎంసీ పాలకవర్గం నియామకం

- చైర్‌పర్సన్‌గా అంకు సంధ్యదామోదర్
- వైస్ చైర్మన్‌గా చీల శంకర్



అంకు సంధ్య



చీల శంకర్



బోధన్: బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అంకు సంధ్యదామోదర్, వైస్ చైర్మన్‌గా చీల శంకర్(హున్సా)తోపాటు పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రెటరీ ఎం.రఘునందన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన పాలకవర్గం 2026 వరకు కొనసాగనుంది. పాలకవర్గ సభ్యులుగా కర్నె గంగారాం, కె.వెంకటేశ్వరరావు, నడిపోళ్ల వసంత్‌రెడ్డి, రమావత్ రవిదాస్, ఎస్.భూమయ్య, బొబ్బిలి శ్రీనివాస్, చేపూరి గంగాకిశోర్, నీరడి సాయన్న, బొర్రోళ్ల శ్రీనివాస్, సలీంబేగ్, ఆవుల బాలకృష్ణారెడ్డి, చీకోటి అంజయ్య, కరిటూరి సత్యనారాయణ(పీపీసీఎస్ చైర్మన్, జైతాపూర్), బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నియమితులయ్యారు.

కౌన్సిలర్ ఏఎంసీ చైర్‌పర్సన్ అయ్యారు

బోధన్ పట్టణంలోని బీసీ సామాజిక వర్గానికి(రెడ్డికా) చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అంకు దామోదర్ సతీమణి అంకు సంధ్య ప్రస్తుతం 26వ వార్డు కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుల్లో దాము ఒకరు. వైస్ చైర్మన్‌గా నియమితులైన సాలూర మండలంలోని హున్సా గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు చీల శంకర్ వీరశైవ లింగాయత్ సమాజ్ (బీసీ)కు చెందిన వ్యక్తి. మాజీ ఎంపీటీసీ సభ్యుడు.

క్లుప్తంగా

ప్రశాంతంగా పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1562 మంది విద్యార్థులకు గానూ 1485 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.

23 నుంచి తెయూ బీపెడ్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీపెడ్(బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్) 2, 4 సెమిస్టర్ రెగ్యులర్, 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ సోమవారం తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in ను సంప్రదించాలని కంట్రోలర్ సూచించారు.

28 నుంచి తెయూ బీఈడీ ప్రాక్టికల్..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ సోమవారం తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు మొదటి ఫేజ్ ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 4వరకు, రెండో ఫేజ్ సెప్టెంబర్ 5 నుంచి 13 వరకు జరుగుతాయని కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని జీఎస్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరుగుతున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం ముగిశాయి. అండర్–12, అండర్–15 బాలబాలికలతో పాటు పురుషుల, మహిళల విభాగంలో పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో భాగంగా అండర్–12 బాలికల విభాగంలో నిజామాబాద్ క్రీడాకారులు, బాలుర విభాగంలో ఖమ్మం, అండర్–15 బాలికల విభాగంలో మంచిర్యాల, బాలుర విభాగంలో ఖమ్మం జిల్లాల క్రీడాకారులుగా చాంపియన్‌గా నిలిచారు. పురుషుల సింగిల్స్‌లో కొత్తగూడెం, మహిళల సింగిల్స్‌లో నిజామాబాద్, పురుషుల డబుల్స్‌లో కొత్తగూడెం, మిక్స్‌డ్ డబుల్స్‌లో నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు చాంపియన్‌గా నిలిచారు. ముగింపు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.శరత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌ను ప్రదానం చేశారు. టీటీ సంఘం బాధ్యులు దారం గౌతమ్‌రెడ్డి, మద్దెల వికాస్,తదితరులున్నారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం రేపు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్ రావు సోమవారం తెలిపారు. ఈ ఉద్యోగ మేళాను అన్నపూర్ణ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, పసిఫిక్ కన్సల్టింగ్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ వారు నిర్వహిస్తున్నారు. ఫీల్డ్ క్రెడిట్ ఆఫీసర్, డెవలప్మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ఉద్యోగాలున్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయం, శివాజీ నగర్, నిజామాబాదులో 14న ఉదయం హాజరుకావాలని, వివరాలకు 9581768413, 9948748428, 6305743423, 9959456793 ఫోన్ ద్వారా సంప్రదించాలని అధికారి తెలిపారు.

ప్రజావాణికి వెల్లువెత్తిన ఫిర్యాదులు

- మొత్తం 154 అర్జీలు
- వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచన



కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇతర అధికారులు

నిజామాబాద్‌అర్బన్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 154 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యా దుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్‌లకు విన్నవించి అర్జీలు సమర్పించారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యా దులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు.

శ్మశానవాటిక, వీధిలైట్ల సమస్యలపై..

నాగారంలో శ్మశానవాటిక, రోడ్ల మరమ్మతులు, వీధిలైట్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రజావాణిలో ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత ఫిర్యాదు చేశారు. గతంలో చాలాసార్లు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని ఇచ్చామని పేర్కొన్నారు. అయినా ఇప్పటివరకు కూడా ఎలాంటి పనులు ప్రారంభించలేదన్నారు. వీధిలైట్లు కూడా లేకపోవడం వల్ల బస్తీవాసులు రాత్రి వేళల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్‌కు విన్నవించారు.

నిధుల వివరాలు ఇప్పించండి



ధర్నా చేస్తున్న సుర్బిర్యాల్ గ్రామస్తులు

ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామ సర్వ సమా జ్ కమిటీకి మంజూరైన నిధుల వివరాలు, మాజీ సర్పంచ్ ఖర్చు చేసిన వివరాలను ఇప్పించాలని గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. వీడీసీకి చెందిన రూ.10 లక్షలు, సీసీ రోడ్ల కోసం రూ.15 లక్షలు, ఎస్డీఎఫ్ నిధులు రూ.77 లక్షలు, జీపీ భవనానికి రూ.5 కోట్లతో నిధులు మంజూరయ్యాయని, వీటి పనులు చేయకుండానే మాజీ సర్పంచ్ అక్రమాలకు పాల్పడినట్లు వారు పేర్కొన్నారు. ప్రశ్నిస్తే గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు తెలుపుతున్నారని వారు పేర్కొన్నారు. తక్షణమే ఈ నిధులకు సంబంధించిన ఖర్చుల వివరాలు అందించేలా చూడాలన్నరు.

భూకబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి



నిరసన తెలియజేస్తున్న యంచ గ్రామస్తులు

గ్రామ పరిధిలో ఒక వ్యక్తి అక్రమంగా భూకబ్జా చేశాడని చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు నవీపేట మండలం యంచ గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్–272, 271లోని భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని, ప్రభుత్వ భూములను సైతం రెవెన్యూ అధికారుల సహకారంతో అక్రమంగా పట్టా చేయించుకున్నారని వారు పేర్కొన్నారు. దీనిపై అధికారులు విచారణ జరపాలని వారు పేర్కొన్నారు.

పోస్టులు భర్తీ అయితేనే మెరుగైన సేవలు



మోర్తాడ్ కమ్యూనిటీ ఆస్పత్రి

- వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులలో వైద్యులు, సిబ్బంది లేక ఇబ్బందులు
- ఏడాది కిందనే విలీనం చేసినా పోస్టుల భర్తీకి జరుగని కసరత్తు
- వైద్య ఆరోగ్య శాఖ వైద్యులు, సిబ్బందితోనే సేవల కొనసాగింపు

మోర్తాడ్(బాల్కొండ): వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులలో వైద్యులు, సిబ్బంది నియామకం జరుగక పోవడంతో వైద్య సేవలు మెరుగవలేదు. ఏడాది కింద కమ్యునిటీ ఆస్పత్రులను వైద్య ఆరోగ్య శాఖ నుంచి వైద్య విధాన పరిషత్ పరిధిలోకి విలీనం చేశారు. అప్పటి నుంచి పోస్టులను భర్తీ చేయకపోవడంతో వైద్య ఆరోగ్య శాఖ వైద్యులు, సిబ్బందితోనే వైద్య సేవలను నెట్టుకొస్తున్నారు. ఫలితంగా రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో సఫలం కావడం లేదు. వైద్య విధాన పరిషత్ ద్వారా ప్రత్యేక నియామకాలు చేపడితేనే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఉన్నతాధికారులు భావించారు. గత ప్రభుత్వం వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది నియామకంపై దృష్టి సారించకపోవడంతో ఇప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. జిల్లాలో మోర్తాడ్, బాల్కొండ, డిచ్‌పల్లి, ధర్పల్లి, నవీపేట్, వర్నిలలో 30 పడకల ఆస్పత్రులు, ఆర్మూర్, బోధన్‌లలో వంద పడకల ఆస్పత్రులున్నాయి. 30 పడకల ఆస్పత్రులలో 14 మంది వైద్యులు, 18 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. వంద పడకల ఆస్పత్రులలో 48 మంది వైద్యులు, 73 మంది సిబ్బంది అవసరం. భీమ్‌గల్‌లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణంలో ఉంది. జిల్లాలోని అన్ని ఆస్పత్రులకు కలిపి 132 మంది వైద్యులు, 181 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. నియామకాల ప్రక్రియ పూర్తి చేస్తే రోగులకు అన్ని రకాల వైద్యం అందుతుంది. ఈ విషయంలో నిర్లక్ష్యం వల్ల వైద్యం అందక అనేక మంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈ ప్రభుత్వమైనా వైద్యులు, సిబ్బంది నియామకాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

త్వరలోనే నియామకాలు

వైద్యుల భర్తీ ప్రక్రియ కొనసాగుతుంది. అలాగే సిబ్బంది నియామకాలు చేపట్టారు. నియామకాలు పూర్తి కాగానే జిల్లాలోని అన్ని ఆస్పత్రులకు వైద్యులు, సిబ్బందిని కేటాయిస్తాం.

– డాక్టర్ శివశంకర్, వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి

తైక్వాండో పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



నిజామాబాద్‌నాగారం: కరాటే, తైక్వాండో పోటీలు ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగాయి. ఈ పోటీలలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారని సోమవారం సూపర్ సెక్ట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ నర్సింహారావు సోమవారం తెలిపారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు:


- కటా విభాగంలో బంగారు పతకాలు–అక్షయ్(నిజామాబాద్), లితిక(లింగంపేట, కామారెడ్డి), రఘు(బిచ్కుంద, కామారెడ్డి)
- కటా విభాగంలో వెండి పతకాలు– పవన్, శ్రీదేవి(బిచ్కుంద, కామారెడ్డి)
- కటా విభాగంలో కాంస్య పతకాలు– సాయినాథ్, శ్రీనిజ, వర్షిత్, ప్రణీత్(బిచ్కుంద, కామారెడ్డి)
- స్పారింగ్ విభాగంలో వెండి పతకాలు– పవన్, శ్రీనిజ(బిచ్కుంద, కామారెడ్డి), లితిక(లింగంపేట, కామారెడ్డి), అక్షయ్(నిజామాబాద్)

చోరీ కేసులో ఒకరి అరెస్టు

భిక్కనూరు: బైక్‌లు దొంగతనం చేస్తున్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సోమవారం తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్నప్పుడు మల్లుపల్లి గ్రామానికి చెందిన వల్లపు గట్టు మల్లయ్య అలియాస్ మల్లేష్ అనుమానాస్పద స్థితిలో కనిపించాడని.. దీంతో విచారించగా గత జూలై 31న భిక్కనూరు చౌరస్తా నుంచి బైక్‌ను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని ఎస్సై తెలిపారు. ఆ వ్యక్తి నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని మొబైల్ కోర్టు న్యాయమూర్తి దీక్షిత్ ఎదుట ప్రవేశపెట్టగా ఆయన 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించాడని ఎస్సై వివరించారు. మల్లయ్యపై కామారెడ్డిలో చోరీ కేసులు, సిద్ధిపేటలో హత్యాయత్నం కేసులు కూడా నమోదై ఉన్నట్లు తెలిసిందన్నారు.

ఛిద్రమవుతున్న చిరు బతుకులు

- పోలీసుల రికార్డుల్లో 8 నెలల్లో 7 కేసులు..
- పంచాయితీల ద్వారా పరిష్కారం అవుతున్నవి ఎన్నో ?



బోధన్‌టౌన్(బోధన్): బంగారు భవిష్యత్ కోసం కలలు కంటున్న చిన్నారుల జీవితాలు మొగ్గ దశలోనే ఛిద్రమవుతున్నాయి. అభంశుభం తెలియని వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతూ వారి జీవితాలను కామాంధులు రోడ్డుపైకి లాగుతున్నారు. ఎవరి చెప్పుకోవాలో అర్థంకాక తల్లిదండ్రులు మనోవేదనకు లోనవుతున్నారు. ఇలాంటి అత్యాచార ఘటనలు కొన్ని మాత్రమే పోలీసు రికార్డుల్లోకి ఎక్కగా పరువు ప్రతిష్ఠలకు భయపడి పలు చోట్ల బయటకు రానివి ఎన్నోఉన్నాయి. ఇవే కాకుండా పెద్దమనుషుల పంచాయితీలలో వెలకట్టి కనుమరుగు అవుతున్నవి మరెన్నో ఉన్నాయి. బోధన్ నియోజకవర్గంలో 8 నెలల్లోనే మైనర్లపై పలు అత్యాచార ఘటనలు వెలుగు చూశాయి. నాలుగు రోజుల క్రితం పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో మైనర్ బాలిక అత్యాచార ఘటన చోటు చేసుకోగా, పెంటాకుర్దు, చిన్న మావంది, రాజీవ్‌నగర్ తండాల్లో 7 పోక్సో కేసులు నమోదయ్యాయి. ఇందులో 2 కేసులు శక్కర్‌నగర్, మరో రెండు కేసులు పెంటాకుర్దులో నమోదు కాగా వివిధ గ్రామాల్లో ఒకటి చొప్పున నమోదయ్యాయి. ఇలాంటి ఘటనలకు పేదరికం ఒక కారణం కాగా, తల్లి దండ్రులకు పిల్లలపై పర్యవేక్షణ లేకపోవడం కారణాలుగా నిలుస్తున్నాయి. ఎవరో తెలియని వారు కుండా చుట్టూ ఉండే వారే ఎక్కువగా అత్యాచారాలకు పాల్పడుతున్నారు.

అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతంలో గల నిరుపేదలు తమ పిల్లలపై పర్యవేక్షణ చూపకుండా, పొట్టకూటి కోసం కూలినాలి చేసుకోవడంలోనే తమ జీవనాన్ని సాగిస్తున్నారు. ఇలాంటి వారికి షీటీంలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గతంలో పోలీసు శాఖ నుంచి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కళాజాత కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించే వారు. ఇప్పుడు కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు, మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే ఫిర్యాదు చేయాలి

మైనర్లను ఎవరైన మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెడితే భయానికి లోను కాకుండా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడుతాం. పిల్లలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు కూడా పర్యవేక్షించాలి. పాఠశాలల్లో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– శ్రీనివాస్, ఏసీపీ, బోధన్

నిందితులను కఠినంగా శిక్షించాలి

మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే నిందితులను కఠినంగా శిక్షించాలి. స్వచ్ఛంద సంస్థల ద్వారా, పోలీసు శాఖ కళాజాత బృందాల ద్వారా పాఠశాలల్లో, స్లమ్ ఏరియాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.

– తూము పద్మాశరత్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్, బోధన్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న బి ధర్మానాయక్

నిజామాబాద్‌అర్బన్: మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని సీబీసీ(సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్) ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మానాయక్ అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో సోమవారం 'నశా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ధర్మానాయక్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల కారణంగా జీవితం అంధకారమవుతుందని, అనారోగ్యం పాలవుతారన్నారు. యువత చదువుతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, క్రమ శిక్షణతో కూడిన చదువుతో ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ బీఎస్ మీనా, ఆకాశవాణి ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ మోహన్‌దాస్, సెంట్రల్ బ్యూర్ ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ అసిస్టెంట్ రషీద్, సీబీసీ ఎంటీఎస్ పోచయ్య, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఆలయంలో ప్రసాదం తయారీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌రూరల్: మాధవనగర్ సాయిబాబా ఆలయంలో లడ్డు, పులిహోర తయారు చేయటానికి, నైట్‌వాచ్‌మెన్‌గా పనిచేయటానికి కొటేషన్లు కోరుతున్నట్లు ఆలయ ఈవో శ్రీరాంరవీందర్ గుప్తా తెలిపారు. రెండేళ్ల కోసం భక్తులు కొబ్బరికాయలు కొట్టినవి, వాటిని పోగుచేయడానికి లడ్డూ, పులిహోర కవర్లు సప్లయ్ చేయడానికి, ప్రతి గురువారం అన్నదానం వంటచేయటానికి, కూరగాయలు సప్లయ్ చేయడానికి, వంటసామగ్రి సరఫరాకు ఈనెల 17 వరకు కొటేషన్లు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు దేవాదాయశాఖ పర్యవేక్షణ అధికారి సమక్షంలో ఓపెన్ చేసి తక్కువ కొటేషన్ ఇచ్చిన వారికి టెండర్ దక్కుతుందని ఏవో పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్ చోరీ

బాన్సువాడ రూరల్: తాడ్కోల్ శివారు పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ కాయిల్స్ చోరీకి గురైనట్లు రైతు కొల్లూర్ గంగారాం సోమవారం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 11న ఉదయం వెళ్లి పొలానికి నీరు పెడదామని బోర్ వేయగా టాన్స్‌ఫార్మర్ కిందపడి ఉండి కాపర్ కాయిల్ దొంగిలించినట్లు గుర్తించారు. చుట్టుపక్కల వెతికినా కన్పించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చే సి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

నవీపేట శివారులో ఆయిల్..

నవీపేట: మండలంలోని నవీపేట–నాగేపూర్ గ్రామాల శివారులో రెండు ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి గుర్తు తెలియని దుండగులు ఆయిల్‌ను చోరీ చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం తెలిపారు. లైన్‌మెన్ కృష్ణ ఫిర్యాదు మేరకు పంచనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చోరీపై సమాచారం ఇవ్వని స్థానిక అధికారులు

భిక్కనూరు: అంతంపల్లి శివారులో ఈనెల 2న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్‌ను దొంగలు ఎత్తుకెళ్లిన విషయాన్ని స్థానిక విద్యుత్ అధికారులు, ఉన్నతాధికారులకు సమాచారమివ్వలేదని బాధిత రైతు సందుగారి జైపాల్‌రెడ్డి సోమవారం బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. కాపర్ కాయల్స్ చోరీ విషయమై ఎఫ్ఐఆర్ కాపీని భిక్కనూరు ట్రాన్స్‌కో అధికారులకు అదేరోజు ఇచ్చానని, ఇప్పటి వరకు ఈ విషయాన్ని స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వలేదన్నారు. దీని వల్ల తనకు ట్రాన్స్‌ఫార్మర్ కొత్తది మంజూరు కాలేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తనకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయాలని ఆయన కోరారు.

ఇసుక డంపుల సీజ్

రుద్రూర్: పొతంగల్ శివారులో రెండో బ్రిడ్జి దాటిన తర్వాత అక్రమంగా నిల్వచేసిన రెండు ఇసుక డంపులను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లేష్ తెలిపారు. రెండు డంపుల్లో ఉన్న సుమారు 18 ట్రాక్టర్ల ఇసుకను మంగళవారం తహసీల్ కార్యాలయంలో వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు తొలుత రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. అక్రమంగా ఇసుక నిల్వలు చేస్తున్న వారిని గుర్తించి రెవెన్యూ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లారం మేఘన డెంటల్ కాలేజ్ పక్కన పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుంచి 3 సెల్‌ఫోన్లు, రూ.1.03 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏసీపీ విష్ణుమూర్తి, సీఐ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

లారీని ఢీకొని యువకుడి మృతి



జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లి మండలం సికింద్రా పూర్ గ్రామం వద్ద 44 నంబర్ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు ఆగి ఉన్న లారీని ఢీకొని పడకల్ తండకు చెందిన బాదావత్ సంతోష్ (31) అక్కడికక్కడే మృతి చెందాడు. సంతోష్ సుద్దపల్లిలో హోటల్ నడుపుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. మోటార్ సైకిల్ పై హోటల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడికి భార్య,కుమారుడు, కుమార్తె ఉన్నారు.

క్రైం కార్నర్

పోచారం ప్రాజెక్టులో దూకిన వివాహిత

- కాపాడిన యువకులు
- కుటుంబ కలహాలే కారణం



వనం నాగరాణి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంప్రాజెక్టులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివాహితను అక్కడే ఉన్న ఇద్దరు యువకులతోపాటు పోలీసులు కాపాడారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. మెదక్ పట్టణానికి చెందిన వనం నాగరాణి(33)అనే వివాహిత కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది సోమవారం నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంప్రాజెక్టు వద్దకు చేరుకొని కట్టపై తన సెల్‌ఫోన్‌ను ఉంచి ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆ సమయంలో ప్రాజెక్టు వద్ద కొద్దిదూరంలో ఉన్న మాల్తుమ్మెద గ్రామానికి చెందిన నరేష్, అఖిల్ అనే యువకులు వెంటనే స్పందించి నీటిలో నుంచి నాగరాణిని బయటకు తీసి నాగిరెడ్డిపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో స్థానిక ఎస్సై మల్లారెడ్డి, కానిస్టేబుల్ వినోద్ హుటాహుటిన ప్రాజెక్టు వద్దకు చేరుకొని ప్రాణాపాయస్థితిలో ఉన్న నాగరాణి కడుపులో నీటిని తొలగించారు. అనంతరం ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు.

మెట్లపై నుంచి జారి పడి మహిళ మృతి

వర్ని: సైదిపూర్ గ్రామానికి చెందిన కేతావత్ పంగు(33) అనే మహిళ తన ఇంటిపై ఉన్న బట్టలు తీసుకురావడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ మెట్లపై నుంచి జారి పడి మృతి చెందినట్లు వర్ని ఎస్సై కృష్ణ కుమార్ వెల్లడించారు. ఆదివారం రాత్రి మహిళ జారిపడగా.. కుటుంబసభ్యులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కాసేపటికే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కను తప్పించబోయి కారు బోల్తా

- ఐదుగురికి గాయాలు



నిజాంసాగర్(జుక్కల్): నాందేడ్- సంగారెడ్డి జాతీయ రహదారిపై నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా సమీపంలో సోమవారం కుక్కను తప్పించబోయి ప్రమాదవశాత్తు కారు బోల్తాపడింది. ఈ ఘటనలో కారు పల్టీలు కొట్టడంతో పటాన్‌చెరుకు చెందిన ఐదుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో పిట్లం ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ నగర్‌లో చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపిన వివరాలు.. స్థానికంగా నివాసం ఉంటున్న ముత్యాల సరోజ(75)కు నలుగురు పిల్లలు. అందరికీ వివాహం అవడంతో వృత్తిరీత్యా వేరే ప్రాంతంలో స్థిరపడ్డారు. సరోజ ఒక్కరే ఇంట్లో నివసిస్తున్నారు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో తన ఇంట్లో పడుకొని ఉండగా ఒక గుర్తు తెలియని మహిళ ఇంట్లోకి వచ్చి ముఖంపై ఒక టవల్ కప్పి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లింది. ఆమె ముందు భాగం చైను పట్టుకోగా సగం తెగిన భాగం(2 తులాలు)తో ఆ మహిళ ఇంటి నుంచి పారిపోంది. ఈ విషయం గురించి బాధితురాలు ముత్యాల సరోజ నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా ఎస్‌హెచ్‌వో మహేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.